# లయ

## శ్రీ కొండిపర్తి శేషగిరిరావు

అబ్బా! ఈ పాట ఎంత ఇంపుగా ఉంది. ఆ గేయం ఎంత సొంపుగా ఉంది, అని సర్వసాధారణంగా మనం అనుకొంటూ ఉంటాము. ఈ ఇంపూ సొంపూ ఎక్కడినుంచి వచ్చాయి అని ఆలోచిస్తే, రాగంలోనూ, గేయంలోనూ ఉండే ఓ తీయనైన కదలిక అని తెలుస్తుంది. ఈ తీయనైన కదలికే రస పరిభాషలో లయ ఔతోంది.

ఇలాంటి లయ, రూపంలోకూడా ఉందా! అనే భావన కలిగితే, ఎలాంటివారైనా కొంచెం చలిస్తారు.

అందుకు కారణాలు కూడా తోరణాల్లా లేక పోలేదు. అందంగా కదిలేదే లయ, అనే ఓ దృఢమైన అభిప్రాయం చాలాకాలంగా మనలో పాతుకు పోయింది. దాంతో సంగీత సాహిత్యాలలోని లయే లయగా మన ముందు నిలబడుతోంది. అందుకే మనం రూపంలోనూ, ఓలాంటి లయ ఉందవే భావనను అంతగా భావించలేకపోతున్నాం.

ఐనా అమూర్త జగత్తులోని ఇంపునూ సొంపునూ ఏ లక్షణాలవలన ఆస్వాదిస్తున్నామో, అలాంటి లక్షణాలే మూర్త జగత్తులోనూ ఉండిఉండాలి. లేకపోతే రసరూపాలైన రూపాలు అంత మనోజ్ఞంగా మనకు కనిపించవు—అనే భావం ఓనాడు నాలో మెదలటంతో ప్రతి రూపాన్నీ పరిశీలించటం ప్రారంభించాను. అప్పుడు సుందరమైన ప్రతిరూపమూ కొన్ని లావణ్యాలను వ్యక్తపరుస్తూ, నా ఊహాపరిధిని అధిగమించు రసానుభూతులను కలిగిస్తూపోవడం కనబడింది. కాకపోతే రూపం వ్యక్తపరిచే లావణ్యంలోని తీయదనాన్ని సర్వసాధారణంగా ఎవరూ దర్శించలేకపోతున్నారు. ఆ రూపలావణ్యాల్ని రసమయంగా దర్శించటమూ, ఆస్వాదించటమూ మొదటలో కొంచెం కష్టమే ఔతుంది. ఐనా ప్రతిరూపమూ వ్యక్తపరిచే ఆకారాలవెంటా, వాని అంచులను కౌగలించుకొన్న రేఖలవెంటా, పైనుంచి క్రిందికి చూస్తూ మన దృష్టిని జార్చటం ప్రారంభిస్తే, అందమైన ప్రతి రూపంలోనూ, కొన్ని ఒంపులూ సొంపులూ కనిపిస్తాయి. ఇంకొంచెం ముందుకుపోతే ఆ ఒంపులూ, సొంపులూ స్థాణువుగా ఉండక, మన హృదయాల్ని మధురంగా కదిపేవికూడా ఐఉంటాయ్.

కనుక రాగంలోనూ ఛందంలోనూ ఎలాంటి శబ్దాత్మకమైన కదలికలు ఉన్నాయో, అలాంటి మధురమైన కదలికలే దృశ్యాత్మకమైన రూపంలోనూ, మూర్తిలోనూ ఉన్నాయి.

అసలు లయకు రెండు స్వరూపాలున్నాయి. అందు మొదటి స్వరూపంలోని లయ తాను కదులుతుంది. రెండవ స్వరూపంలోని లయ తాను కదలక ద్రష్టలను కదిలిస్తుంది. అందుకని, తాను కదిలే లయ అభౌతికమైంది ఐతే; ద్రష్టలను మనోజ్ఞంగా కదిలించే లయ భౌతికమైంది ఔతుంది.

ఇలా ఈ రెండు స్వరూపాలలోనూఉన్న లయకు ఒక సామాన్యధర్మంకూడా ఉంది. అది దాని ప్రయాణం. లయ తాను ప్రయాణించే మార్గంలో రసవత్తరంగా, రసస్ఫోరకంగా వ్యక్తమౌతుంది.

అందువల్లే నాదలయ తాళరూపంలో ఉంటుంది. కనుక రాగంలోని ధ్వనులు ఓ చోట తేలికగానూ, మరోచోట భారంగానూ ఉండి అనేక స్వరవిన్యాసాలతో రమ్యంగా కదులుతుంటాయి. ఆ ధ్వని కదలికల్లోనే మృదుమధురమైన నాదలయను మనం ఆస్వాదిస్తుంటాము. అంతేకాకుండా ఓ స్థాయి మరో స్థాయిలోకీ, ఓ స్వరం మరో స్వరంలోకీ, ఓ రాగం మరో రాగంలోకీ సాగిపోతున్నప్పుడు కూడా మనం ఈ నాదలయను పొందుతుంటాం.

అలాగే ఇంపైన పదావళితో కూడిన గేయంలోనూ, వృత్తంలోనూ ఓ శబ్దాత్మకమైన లయ

ప్రత్యక్షమౌతుంది. ఈ లయ సాహిత్యపదాలమీద ఆధారపడిఉంటుంది. ఇందులో, ఓ పదంనుంచి మరో పదానికి శబ్దం పోతూఉంటే, ఆ శబ్దం ఓ స్థాయిలో లేక ఓ చోట భారమైన శబ్దాలను సృష్టిస్తూ, మరోచోట మృదువైన శబ్దాలను సృష్టిస్తూ ముందుకు సాగిపోతూ ఉంటుంది. అప్పుడు ఆ శబ్ద విన్యాసంలోని రమణీయతను ఆస్వాదిస్తుంటే, శబ్దం ఉయ్యాల ఊగుతున్నట్లుగా ఉంటుంది. ఇది సాహితీ జగత్తులోని శబ్దాత్మకమైన లయ.

ఇక్కడే మరో రకమైన లయకూడా సాహిత్యంలో ఉంది. పదాలు అనేక అర్థాలనూ, భావాలనూ కలిగిస్తుంటాయి. ఓ భావం మరో భావంలోకీ, ఓ అర్థం మరో అర్థంలోకీ ప్రయాణిస్తున్నప్పుడు ఒకలాంటి భావాత్మకమైన లయను సాహిత్యం మనకు అందిస్తోంది. ఇదే భావాత్మకమైన లయగా సాహిత్యంలో ఒప్పుతోంది.

ఇలా ఉంటుంది నాదంలోనూ పదంలోనూ ఉండే లయ. ఇది అఘాతికం కాబట్టే గతిశీలమూ శ్రవ్యమానమూ ఐంది, కనుకనే ఇది కదిలించే రస సంవేదనలలో మనం కదిలిపోతూ ఉంటాం.

ఇక పోతే ఇలాంటి లయ రూపంలోనూ ఉంది అని అంటే, ఎవరూ 'ఔను' అని అనరు. బాహ్య దృష్టికి రూపంలో లయ ఉన్నట్లుగా కనిపించదు. అసలు లయ అంటేనే సంచలనాత్మకమైందిగదా! పైగా రూపం వస్తుతత్వం కలిగి జడత్వం కలిగింది; కాబట్టి చేతనస్వభావం కలిగిన లయ రూపంలో ఉండటానికి ఆస్కారంలేదు—అనే భావం మనకు సర్వసాధారణంగా కలుగుతుంది. అలా కలగడం కూడా సహజమే!

ఐనా మనం రూపాభిమానులవలె రూపాన్ని అభిమానిస్తూ, ప్రేమిస్తూ దాన్ని సాదరంగా దగ్గరకు తీసుకుని పరిశీలిస్తే—

ఆ పరిశీలన అంతర్వీక్షణగా మారితే!

మూర్త జగత్తులోని రూపం స్థాణువులైననూ, అందులోనూ మనలను మధురంగా కదిపే అంశాలూ, మన దృష్టిని తనతోబాటు మృదువుగా తీసుకొని పోయే కొన్ని లక్షణాలూ ఉన్నాయ్.

ఐతే రూపంలోని ఈ లక్షణాలను మనం దర్శించాలంటే ముందు రూపధర్మాలను ప్రేమతో భేదభావం లేకుండా అవగతం చేసుకోవాలి. ఆ తరువాత రూపంలోనూ, ఆ రూపాన్ని పెనవేసుకొన్న రేఖల్లోనూ, హృదయ పూర్వకంగా మనం తన్మయత్వం పొందాలి. అప్పుడుగానీ రూపనిజస్వరూపంలోని కొన్ని కావ్యాలంకారంలోనిలక్షణాలవంటి లక్షణాలనూ, ప్రమాణాలనూ మనం దర్శించలేం. అంతవరకూ ఎంత లావణ్యచమత్కృతిగల రూపమైనా మనముందు లావణ్యరహితంగా, నిస్తేజంగానే పడి ఉంటుంది.

ఇందుచేతనే సుందరమైన ఏ రూపమూ, పైనుంచి క్రిందివరకూ స్థంభాకృతిలో ఉండదు. అలా ఉండే ఏ రూపమూ అందమైన రూపంగా పరిగణింపబడదు రసజగత్తులో. కనుక అందమైన రూపంలో కొన్ని ఇంపైన ఒంపులూ, సొగసైన సొంపులూ తప్పక ఉంటాయి. అప్పుడుకానీ ఆ రూపం అందంగా చందంగా ఉండదు. అలా అంద చందాలతో ఉండి, ఒంపు సొంపులు కలది ఓ రూపం ఐతే చిత్రం ఔతుంది. ఓ మూర్తి ఐతే శిల్పం ఔతుంది.

పోతే రూపం స్థాణువైననూ, అది మలచబడే నిర్మాణంవల్ల, రూపొందించబడే వివిధ రూపాల భారాలవల్లా కొన్ని రమణీయమైన రూప విన్యాసాలను ఏర్పరచుకొంటుంది. అప్పుడు రూపంలోని రూపాలూ, మూర్తిలోని ఆకారాలూ విభిన్నమైన రసమయరూపాలనూ, ఆకారాలనూ సృష్టించుకొంటాయి. అప్పుడు ఒక ఆకారంనుండి మరో ఆకారంలోకి మనదృష్టి దూకుతూ, మనోజ్ఞమైన ఒంపులూ, సొంపులవెంట మన రసజ్ఞత మధురంగా ప్రవహిస్తూ ఉంటుంది. అలా మన బాహ్యదృష్టి ఆహ్లాదంగానూ, అంతర్ దృష్టి రసస్ఫూర్తితోనూ రమణీయరూపాలలో ప్రవహిస్తున్నప్పుడు, మనలో కొన్ని మధురమైన రూపానుభూతుల కదలికలు మెదిలి, రసానందపు ప్రకంపనలు కలుగుతాయి. వానివల్ల ఓ లాంటి తీయని దృశ్యాత్మకమైన స్పందనలక్షణాలను మనం అనుభవిస్తుంటాం!

అలా మనలో కలిగిన ఆ మృదువైన కదలికల రూప లక్షణమే, రూపలయ ఔతోంది రూప జగత్తులో !!

ఈ రూపలయను, మనకు ఆవలనున్న రూపంలోని రూపలావణ్యంవల్ల పొందుతున్నాం కాబట్టి, ఈ లయ రూప నిర్మాణ సాంకేతిక అంశాలలో గుప్తమై ఉంది. అందుకనే సర్వసాధారణంగా ఈ రూపలయను మనం ఆస్వాదించలేక పోతున్నాం. అసలు నాద శబ్దాలలోని లయను మనం ఎక్కువగా ఆస్వాదించాలంటే, అవి ఎక్కువ రసభరితాలై ఉండాలి. రూపంలోని లయను మనం ఎక్కువగా దర్శించాలంటే రసరూపంతో బాటు ద్రష్టలమైన మనం ఎక్కువ రసజ్ఞులమై ఉండాలి.

అసలు రసజ్ఞత ఉంటేనే ననుకోండి ! మనం రాగాన్నీ, రంగునీ, శబ్దాన్నీ శిల్పాన్నీ ప్రేమించేది. కాక పోతే రసజ్ఞత ఓ చోట ఎక్కువ అవసరం. మరో చోట కొంచెం తక్కువ అవసరం అంతే !

'రూపభేదాః, ప్రమాణాని,
భావ, లావణ్య యోజనే,
సాదృశ్యం, వర్ణికాభంగ
మితి చిత్రం షడంగకమ్'

అన్న మన ప్రాచీనుల ప్రమాణం ప్రకారం రూపానికి లావణ్యంకూడా ఓ అంగంగా చెప్పారు. కనుక లావణ్యమే రూపలయ ఔతోంది మూర్త జగత్తులో. ఈ లావణ్యం రూపనిర్మాణంలో వివిధ రూపాలకూ కూర్చబడిన ఒంపుల సొంపుల వల్ల కలుగుతుంది. ఆ తరువాత ప్రేక్షకుడు ఆ రూపంనుండి ఓ రకమైన లయను పొందుతాడు.

ఐతే ఇక్కడ ఒక చిన్న సత్యం దాగిఉంది. నాదంలోనూ శబ్దంలోనూ ఉండే లయ కదులుతున్నట్లు కనబడుతుంది. కానీ రూపంలోని లయ అలా కదిలినట్లు కనబడదు; కనుక రూపంలోని లయ సంచలనాత్మకమైంది కాదని బాహ్యదృష్టితో చప్పున మనం భావిస్తాం. కానీ. అంతర్‌దృష్టితో చూస్తే ఆ భావం అభావంకూడా అవుతుంది.

ఎందుకంటే రూపంలోని లయ మనకు ఎదురుగా ఉండే, రూపం ప్రవహించే మార్గంలో ఉండి, రూపలయాత్మకంగా మన దృష్టిని ప్రకంపింప జేస్తుంది. అందుకని రూపంలో ఉండే లయ సంచలనాత్మకమైన లక్షణం కలది ఔతోంది. ఇక్కడే మరో చిన్న వ్యత్యాసంకూడా ఉంది.

సంగీత సాహిత్యాలలోని లయను ఆస్వాదించేప్పుడు శ్రోత స్థాణువుగా ఉంటాడు. అవి లయాత్మకంగా కదులుతాయి. రూపంలోనూ మూర్తిలోనూ అలాకాదు, ద్రష్టకు ఆవలఉన్న రసరూపాలు స్థాణువుగా స్థితిశీలంఉండి దృశ్యమానంగా ఉంటాయే కానీ, ద్రష్టమాత్రం రూపాలలోని లయకు అనుగుణంగా రూపలయాత్మకంగా తన దృష్టినీ, తన రసజ్ఞతనూ కదుపుతాడు. అంటే అమూర్తమైన సాహిత్య సంగీతాలలోని లయ తాను కదిలితే, మూర్త్యాత్మకమైన రూపాలలోని లయ తాను కదలక ఆవలి రసద్రష్టలను కదిలిస్తుంది.

అసలు ఈ లక్షణాలకు గల కారణాలను వెతికితే; పదానికీ నాదానికీ వస్తుతత్వం లేనందున వానిలోని శ్రవ్యమాన లయే మనవద్దకువచ్చి మనలో కలిసిపోతోంటుంది. మూర్తికీ రూపానికీ ఓ వస్తుతత్వం ఉంది కాబట్టి వానిలోగల దృశ్యమాన లయను దర్శిస్తున్నప్పుడు మనం కరిగిపోతాం. అందుకే రూపం మనల్నీ, మన రసదృష్టినీ లయాత్మకంగా కదుపుతూ తనలో కలుపుకుంటోంది.

బహుశ అందుకేనేమో ! పదమూ నాదమూ లయాత్మకంగా మనమీద వర్షిస్తే, రూపాలమీదా మూర్తులమీదా మనం లయాత్మకంగా వర్షిస్తాం !

పోతే, సర్వసాధారణంగా మనం మూర్తిలోగల వివిధ ఘనాలనూ ఓ క్రమంలో దర్శిస్తుంటాము. అప్పుడు ఒక ఘనం నుండి మరో ఘనానికి మనదృష్టి సాగిపోతున్నప్పుడు, రూపానుగుణంగా ఓ భావం తరువాత మరో భావం మనలో కదులుతూ ఉంటుంది. ఆ స్థితిలో మనం అమూర్తినుండి ఒకలాంటి భావాత్మకమైన దృశ్యలయను పొందుతూ ఉంటాం.

ఇదే లయను చిత్రంలో ఐతే ఇంకా బాగా పొందవచ్చు. చిత్రం అనేక ఆకారాలను కలిగిఉంటుంది. ప్రతి ఆకారమూ ఒకో రంగునుకూడా కలిగి ఉంటుంది. కనుక మనం ప్రతి ఆకారంలోని రంగు నుండి ఒకో భావాన్నీ, ఒకో అర్థాన్నీ పొందుతూ

ముందుకు సాగిపోతుంటాము. అప్పుడు మనలో అనేకమైన భావాలూ అర్థాలూ మధురంగాగానీ, తీవ్రంగాగానీ కదులుతుంటాయి. అలా భావాత్మకంగా కదిలే భావాల కదలికే చిత్రంలోని భావాత్మకమైన లయ ఔతోంది.

కనుక సంగీత సాహిత్యాలలో భావాత్మకమైన లయ ఎలాఉందో, ఆలానే ఘన రూపంలోనూ వర్ణ చిత్రంలోనూ భావాత్మకమైన లయ ఉంది. కాకపోతే శ్రుతిబద్ధమైన లయ గతిశీలంలో ఉండి తాను కదిలితే, దృశ్యబద్ధమైన లయ స్థితిశీలంలో ఉండి ద్రష్టలను కదిలిస్తోంది.

ఇకపోతే రూపంలోని ఈ లయనే మరో రూపంలోనూ దర్శింపవచ్చు. సర్వసాధారణంగా రూపంగానీ మూర్తిగానీ కొన్ని ఒంపులూ సొంపులూ గల రమ్యమైన రేఖలను బహిర్గతపరుస్తుంది. ఆ రేఖల్లోని తీయదనాన్ని మనం ఆస్వాదించాలంటే, రూపం వ్యక్తపరిచే రేఖలను ముందు దర్శించాలి. పైగా రమణీయ రూపంలోని రేఖలు, ఎప్పుడూ మృదువైన ఒంపులూ సొంపులూ కలిగి, ఎంతో సునిసితంగాఉండి, పారవశ్యాన్నీ సంవేదనలను కలిగించేవిగా ఉంటాయి. అందుకని ద్రష్ట రూపాన్ని ఆస్వాదిస్తున్నప్పుడు ఆ రేఖల వెంట రసవత్తరంగా సాగిపోతాడూ, జారిపోతాడు. అప్పుడుగానీ, రేఖజారిపోయే కొన్ని రమణీయ గతులలో ద్రష్ట ప్రయాణించడు. ఆ ప్రయాణంలో ద్రష్టయొక్క రసజ్ఞత అనేకరేఖామాధుర్యాలను పొందుతుంది.

అలా రసద్రష్ట సంగీతంలోని రాగాలవంటే, సాహిత్యంలోని '.........శిరస్సరజ్ఝరీ పటల ముహుర్ముహుర్లుఠదభంగ తరంగ మృదంగ......' పదాలవంటి రేఖలలో ప్రయాణించటంవల్ల, అతనిలోని రసజ్ఞత తీయనైన కదలికతో క్రిందికి జారిపోతున్నట్లుండి, ఓ మధురమైన స్పందనానుభూతిని పొందుతుంది. అలా మధురమైన వివిధగతులలో ప్రయాణించిన అతనిలోని రేఖాస్పందనాత్మకమైన రసజ్ఞతే, రేఖలలోని లయ ఔతోంది, రూప జగత్తులో.

ఇలా రూప విజ్ఞానంలో వ్యక్తమయ్యే రూప లయే కాకుండా, రూపంలోని వర్ణసామరస్యం వలననూ మరోరకమైన లయ ఉట్టిపడుతూ ఉంటుంది. కాంతివంతమైన అనేకరంగుల సామరస్యంగల చిత్రాన్ని పరిశీలిస్తే; ఇంపైన సొంపైన శబ్దాల స్వరాల సామరస్యంనుండి ఎలాంటి లయను పొందవచ్చో, అలాంటి లయనే మరో స్వరూపంలో వర్ణాల సామరస్యంవల్ల పొందవచ్చును.

కనుక స్వరసామరస్యంలోని లయ సంచల నాత్మకమైంది ఐతే, రూపంలోని వర్ణ సామరస్యంలోని లయ ద్రష్ట రసజ్ఞతను మనోజ్ఞంగా సంచలన పరిచేది ఔతోంది. అలాగే సాహిత్యంలోని శబ్దాల లయ సంవేదనాత్మకమైందిఐతే లావణ్యమూర్తులలోని లయ భావాత్మకంగా ద్రష్టను సంచలన పరిచేది ఔతోంది.

అందువల్లే సాహిత్య సంగీతాలలోని లయ శబ్దాల నాదాల కదలికల వలనా, వాని సామరస్యం వలనా తెలిస్తే, శిల్ప చిత్రాలలోని లయ మూర్తులూ రూపాలూ, ఘనాలూ రంగులూ కదిపే మన దృష్టి ప్రకంపనాల వలన తెలుస్తుంది.

మొదటివర్గం మనకు దూరంగా ఉండి వాని లయ మనకు వ్యక్తపరిస్తే, రెండవవర్గం మన దృష్టిని తన దగ్గరకు తీసుకొని, దానిని రూప లయాత్మకంగా కదిపి, మన మనస్సునుకూడా మధురంగా కదుపుతుంది.

అందుకే నాదంలోనూ శబ్దంలోనూ లయ ఎలా ఉందో, అలానే రూపంలోనూ మూర్తిలోనూ ఉంది. కాకపోతే అమూర్త జగత్తులోని లయ గతంలో వ్యాప్తమైతే, మూర్తజగత్తులోని లయ వర్తమానంలో వ్యాప్తవౌతోంది.

ఏది ఏమైనా రసతత్వానికి లయే జీవప్రాణం. అదిలేని శబ్దాలూ స్వరాలూ జడాలు. రూపాలూ మూర్తులూ జీవచ్ఛవాలు.

కనుక లయే రసతత్వాన్ని లయం కాకుండా కాపాడేది ఔతోంది—!!!

---